ఆసరా.. పేదలకు భరోసా

- మహిళలకు వడ్డీ లేని రుణాలు
- చిరు వ్యాపారాలు చేపట్టి కుటుంబానికి చేదోడుగా స్త్రీలు
- నియోజకవర్గంలో 47,792 మందికి లబ్ధి
- ఈ పథకం ద్వారా రూ.185.20 కోట్ల రుణాలు

పెరవలి: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించినపుడే వారి కుటుంబాల పరిస్థితి మెరుగుపడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా అనే పథకాన్ని ప్రవేశ పెట్టి వేలాది కుటుంబాలకు అండగా నిలిచారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు మొదలు పెట్టి, కుటుంబ పోషణలో తాము భాగస్వాములయ్యారు. కుటుంబ యజమాని ఆదాయానికి అదనంగా అతివల ఆదాయం కూడా తోడవడంతో ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి పై మెట్టుకు చేరింది. ఈ పథకం అమలులో నిడదవోలు నియోజకవర్గం ఆదర్శవంతంగా నిలుస్తోంది. అందుకు ఎమ్మెల్యే తీసుకున్న చొరవ, అందించిన తోడ్పాటే కారణం.

నియోజకవర్గంలో ఎంత మందికి లబ్ధి

ఆసరా పథకం ద్వారా నిడదవోలు నియోజకవర్గంలో 47,792 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. అర్హతను బట్టి ఒక్కో లబ్ధిదారు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ రుణం పొందారు. ఇది వడ్డీ లేని రుణం. నిర్ణీత గడువులోగా లబ్ధిదారులు అప్పు చెల్లిస్తే సరిపోతుంది. ఈ మొత్తాలతో మహిళా లబ్ధిదారులు వారు వివిధ రకాలైన చిరు వ్యాపారాలు చేపట్టి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఇళ్ల వద్దే ఫ్యాన్సీ, కిరణా, కిళ్లీ షాపు, బట్టలు, కూరగాయల దుకాణాలు తెరిచారు. మరికొందరు టైలరింగ్ వంటి వృత్తులు చేపట్టి ఎంతోకొంత సంపాదిస్తున్నారు.

మూడో విడతలో ఎంతమందికి లబ్ధి ?

ఆసరా పథకం కింద ఇప్పటి వరకు నాలుగు విడతల్లో నిడదవోలు నియోజకవర్గంలో 4,815 గ్రూపులకు చెందిన 47,792 మంది మహిళా లబ్ధిదారులకు రూ.185.20 కోట్ల మేర మేలు చేకూరింది. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో చిరు వ్యాపారాలు గణనీయంగా పెరిగాయి.



ఖండవల్లిలో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు (ఫైల్)

ఏయే మండలాలకు ఎంతెంత?

మండలం	గ్రూపులు	లబ్ధిదారులు	రుణం (రూ.కోట్లలో)
పెరవలి	1531	15,346	74.60
నిడదవోలు రూరల్	1438	14,217	48.08
ఉండ్రాజవరం	1300	12,769	45.46
నిడదవోలు టౌన్	546	5460	17.06
	4815	47,792	185.20

పేదల పాలిట పెన్నిధి



ఆసరా పథకం పేదల పాలిట పెన్నిధి. ఈ పథకంలో మంజూరైన రుణం అనేక వేల చిరు వ్యాపారులకు ఆర్థిక చేదోడుగా నిలిచింది. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ ఈ పథకం కింద 50 వేల పైగా మహిళలు వడ్డీ లేని రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. చిరు వ్యాపారులను పలకరించినపుడు వారి ముఖాల్లో సంతోషం చూసినపుడు ఎంతో ఆనందం కలుగుతుంది.
– జి.శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, నిడదవోలు

ఫ్యాన్సీ షాపు నడుపుతున్నా..



ఆసరా పథకంలో రూ.18 వేల రుణం తీసుకున్నాను. ఈ సొమ్ముతో ఫ్యాన్సీ షాపు ప్రారంభించాను. అమ్మకాలు బాగానే ఉన్నాయి. వచ్చే ఆదాయం కుటుంబానికి చేదోడుగా ఉపయోగపడుతోంది. గతంలో కంటే మెరుగ్గా జీవిస్తున్నాం. ఇది అంతా జగనన్న చలువే.
– పాలకొల్లు శ్రీవల్లి, లబ్ధిదారు, కానూరు

ఆసరా ఆదుకుంది



గతంలో ఇంట్లో ఖాళీగా ఉండేదాన్ని. ఆసరా పథకంలో రూ.24 వేల రుణం తీసుకున్నాను. ఆ సొమ్ముతో కిళ్లీషాపు మొదలు పెట్టాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తున్నది. రోజుకి రూ. 300 నుంచి రూ.400 వరక సంపాదిస్తున్నాను. ఆసరా పథకం మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుంది.
– బి. దుర్గాదేవి లబ్ధిదారు, కానూరు

టైలరింగ్ మొదలుపెట్టా..



ఆసరా పథకంలో రూ.24 వేల రుణం వచ్చింది. ఈ సొమ్ముతో కుట్టుమెషీన్ కొనుగోలు చేసి, ఇంటి వద్దే దుస్తులు కుట్టుకుంటున్నాను. దీంతో రోజుకు రూ.300కి పైగా సంపాదిస్తున్నారు. మా కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నాననే సంతృప్తి కలుగుతోంది.
– అంబటి మంగ, లబ్ధిదారు, నడుపల్లి

క్లుప్తంగా

సంక్షేమం, అభివృద్ధికే పట్టం కట్టండి

- ఎమ్మెల్యే తనయుడు వరుణ్‌సాయి



కంసాలిపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి, పార్టీ నాయకులు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని ఎమ్మెల్యే తనయుడు జి.వరుణ్ సాయి కోరారు. మండలంలోని కంసాలిపాలెంలో ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా శుక్రవారం వరుణ్‌సాయి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఆ పార్టీ నాయకులు బెజవాడ నాగగంగాధర్, ఉప్పాటి వెంకటేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలి: డీఎస్పీ రామారావు



గోపాలపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామారావు, సీఐ, ఎస్సైలు

గోపాలపురం: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు కోరారు. గోపాలపురంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లు, ఎన్నికల సమయంలో ఇబ్బందులు సృష్టించే వారిని బైండోవర్ చేశామని చెప్పారు. అలాగే మండలంలోని పెద్దగూడెం, వాదాలకుంట, భీమోలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూడా డీఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట దేవరపల్లి సీఐ కె. బాల సురేష్, ఎస్సై కర్రి సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

టీడీపీలో తప్పని వర్గ పోరు

తాళ్లపూడి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కొవ్వూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం అన్నదేవరపేటలోని ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం అదే గ్రామంలోని బంగారు పాపమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు హాజరు కాలేదు. గ్రామంలోని యవగళం నాయకుల ఆహ్వానం మేరకు అన్నదేవరపేట వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావు కార్యక్రమానికి టీడీపీకి చెందిన జీవీ ప్రసాద్, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, భరత్, గణపతి, అబ్బులు హాజరవగా, గ్రామంలోని మరో వర్గం గైర్హాజరైంది. దీంతో పార్టీలోని వర్గపోరు బహిర్గతమైంది. మండలంలో మొదటి నుంచి యువగళం నాయకులు ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి కార్యక్రమాలకు మాజీ మంత్రి జవహర్ వర్గం దూరంగా ఉంటోంది.

ఎన్ని పొత్తులు పెట్టుకున్నా అధికారం మాదే

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- బల్లిపాడులో ప్రజాశీర్వాద యాత్ర



బల్లిపాడు ప్రజాశీర్వాద యాత్రలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

తాళ్లపూడి: కూటమి పేరుతో ఎన్ని పార్టీలతో చంద్రబాబు జత కట్టినా ఆయన చెప్పే కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మరని మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీయే అని ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంట్రారావు అన్నారు. మండలంలోని బల్లిపాడులో శుక్రవారం సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ ఆధ్వర్యంలో వెంకట్రావు ప్రజాశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన లబ్ధి గురించి ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తలారి మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి దమ్మున్న నాయకుడిగా తమ నేత జగన్ నిలిచారన్నారు. మాయ మాటలు చెప్పి ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబును ఎవరూ నమ్మడం లేదన్నారు. ప్రచారంలో జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎం. దమయంతి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, గనిశెట్టి బంగారురాజు, ఇందుగుమిల్లి ప్రభాకర్, నామా ప్రకాశం, పిట్టా శ్రీనివాస్, అందుగుల రవి తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి జగన్



రాజంపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వనిత

- మంత్రి తానేటి వనిత
- గంగోలు, రాజంపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని గంగోలు, రాజంపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆమె పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలోనే ఏరాష్ట్రంలోనూ అమలు చేయని అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత పాలకులు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయలేదన్నారు. కానీ ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ నూరు శాతం అమలు చేయడమే గాకుండా, ఇవ్వని హామీలను కూడా ప్రజలకు అందించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటి వరకూ అమలు చేసిన పథకాలను మంత్రి వనిత ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు కురుకూరి ధనలక్ష్మి, ఎస్‌కే వల్లీ, వెలగా శ్రీరామమూర్తి, నక్కా పోశిబాబు, గంగోలు, రాజంపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలు చూడండి.. ఓటేసి గెలిపించండి



కోరుపల్లిలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కోరుపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటిని అమలు చేసే విధానాలను చూసి వైఎస్సార్‌సీపీ నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలోని కోరుపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు జల్లెడ పట్టి మరీ అందజేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, తిరుమళ్ల దుర్గారావు, పులుమంతుల రామారావు, సత్తిపండు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మసీదులో ఇఫ్తార్ విందు

తాళ్లపూడి: స్థానిక మస్జీద్ ఎ అబూబాకర్ వద్ద శుక్రవారం రాత్రి ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఎండీ ఆరీఫ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందుకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలను గుర్తించి వారికి రిజర్వేషన్ కల్పించిన మహనీయుడన్నారు. ఆయన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా ముస్లింలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు ఆరిఫ్‌ను, తలారి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ ముబారక్ భాషా, షేక్ రహీమ్, మసీదు కమిటీ సభ్యులు షేక్ సర్దార్, షరీఫ్, అన్వర్, జిలాని ,రజాక్ తదితరులు పాల్గొన్నారు.



తలారి వెంకట్రావును సత్కరిస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఆరీఫ్

24వ వార్డులో వైఎస్సార్ సీపీ ప్రచారం

నిడదవోలు: పట్టణంలోని 24 వార్డు ఎస్టీ కాలనీలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఆ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, బీసీ సెల్ కార్యదర్శి గంగుల గోపీయాదవ్, జేఏసీ కన్వీనర్ షేక్ చాన్ బాషా, కౌన్సిలర్లు మానుపటి లక్ష్మి, గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రె పార్వతి, నాయకులు పాల్గొన్నారు.

పాపుల రక్షణకే శిలువ మరణం

- భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం
- క్రీస్తు వేషధారణలో శిలువ వేసే ఘట్టాల ప్రదర్శన
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నిడదవోలు రూరల్: పాపుల రక్షణ కోసమే ఏసుక్రీస్తు శిలువ మరణం పొందారని పాస్టర్ ఎం.చిట్టిరాజు అన్నారు. శుభ శుక్రవారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం, రావిమెట్ల, డి.ముప్పవరం గ్రామాల్లో క్రీస్తు వేషధారణలో శిలువ వేసే ఘట్టాలను విశ్వాసులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఆర్సీఎం, పెంతుకోస్తు, లూథరన్, బైబిల్ మిషన్, జీడీఎం చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ కుమారునిగా అవతరించిన ఏసు శిలువపై తన రక్తాన్ని చిందించి సర్వ మానవాళి పాపాలను తొలగించి విముక్తి కలిగించిన పవిత్రమైన రోజు గుడ్ ఫ్రైడే అని దైవజనులు వివరించారు. ఏసుక్రీస్తు శిలువపై ఉన్నప్పుడు చెప్పిన ఏడువాక్యాల గురించి వాక్యోపదేశం అందించారు.

చాగల్లు: గుడ్ ఫ్రై డే వేడుకలను మండలంలోని చర్చల్లో క్రైస్తవులు జరుపుకున్నారు. బ్రాహ్మణగూడెం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో కె.సాల్మన్‌రాజు దైవ సందేశం వినిపించారు. చాగల్లు, గౌరిపల్లి, మార్కొండపాడు, దారవరం, ఊనగట్ల, ఎస్. ముప్పవరం గ్రామాల చర్చిల్లో విశ్వాసులు ఉపవాస దీక్ష బూని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నల్లజర్ల: ముసుళ్లగుంట ఆర్సీఎం చర్చిలో ఫాస్టర్ ఆంటోనీ వాక్యోపదేశం చేశారు. పాపాలతో వచ్చే శాపం వల్ల సర్వమానవాళి నిత్య నరకానికి గురవుతుండగా, ఆపాప విమోచనకు పరిశుద్ధ రక్తం ఆవశ్యమని సర్వ వేదాలు ఘోషిస్తున్నాయన్నారు. ఆ పవిత్ర కర్తవ్యాన్ని ఏసుక్రీస్తు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెంలో విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో, సుభద్రపాలెంలో బ్రదర్ సంజయ్, పోతవరంలో రాజేష్‌కుమార్, అనంతపల్లి ఈఎంఐ చర్చిలో బ్రదర్ నోవాక్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శిలువ మోసిన ఎమ్మెల్యే అభ్యర్థి తలారి

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్రం నుంచి డైరెక్టర్ టి.జాన్ ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. ఈ శిలువ మార్గంలో తాళ్లపూడి వద్ద వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పాల్గొన్నారు. ఆయన స్వయంగా వేగేశ్వరపురం నుంచి తాళ్లపూడి వరకూ శిలువ మోశారు. శిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటలను క్రైస్తవులకు జాన్ వివరించారు. జెడ్పీ ఛైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు , ఆర్సీఎం చర్చి పరిధిలోని పలువురు విశ్వాసులు పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురంలోని లూథరన్ చర్చిలోను, మలకపల్లిలోని క్రైస్ట్ కమ్స్ చర్చిలోను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఫాస్టర్లు, సంఘస్తులు ఏసుక్రీస్తు శిలువతో పాదయాత్ర చేశారు. ఏసుక్రీస్తును కారణ జన్ముడిగా పేర్కొంటూ సంఘస్తులు కీర్తనలు ఆలపించారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్ నుంచి శిలువతో బస్టాండ్ సెంటర్ మీదుగా వేళ్లచింతలగూడెం వరకూ పాదయాత్ర చేశారు. మండలంలోని వేళ్లచింతలగూడెం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, కోమటికుంట, వాదాలకుంట, పెద్దాపురం, చిట్యాల గ్రామాల ఫాస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

దేవరపల్లి: శుభ శుక్రవారం (గుడ్ ఫ్రై డే) వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యర్నగూడెంలో ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో భక్తులు భారీ ఊరేగింపు జరిపారు. క్రీస్తుపై జరిగిన అమానుష దాడి, వారికి వేసిన శిక్ష తదితర సన్నివేశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ దానియేలు, పవిత్ర, సజీ థామస్, వివిధ గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రై డే ప్రార్థనలు నిర్వహించారు. శిలువపై ఏసుక్రీస్తు చెప్పిన సప్త సూక్తులను స్తుతించి ప్రార్థనలు చేశారు. ఉండ్రాజవరంలోని క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చి, తాడిపర్రు ఐబీఎం చర్చిలలో దైవజనులు ఆర్.ఇజ్రాయిల్, జి.పాల్, కె.జయరావు వాక్యోపదేశం చేశారు. మానవాళి రక్షణ కోసం క్రీస్తు చేసిన త్యాగాలను కొనియాడారు. క్రీస్తు శిలువపై మాట్లాడిన ఏడు మాటలను వివరించారు. వేలివెన్ను, కాల్దారితో పాటు పలు గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో ఆరాధనలు నిర్వహించారు.

కొవ్వూరు: పట్టణంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఉదయాన్నే చర్చిలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మునిసిపల్ ఛైర్ పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులు సెయింట్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు శిలువ మోసిన ఘట్టాన్ని పలుచోట్ల నిర్వహించారు. క్రీస్తు గీతాలు ఆలపిస్తూ పుర వీధుల్లో ప్రదర్శనలు చేశారు.



వేగేశ్వరపురంలో శిలువ మోస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని చర్చిలు విశ్వాసులతో కిటకిటలాడాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సెయింట్ జాన్స్, సెయింట్ ఆంబ్రోస్ చర్చిలతో పాటు కృపాధార లూథరన్ చర్చి, రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చి, జీడీఎం, బేతనియా, మరనాత ప్రార్థన మందిరాలు, న్యూ స్పిరిట్ చర్చి, బైబిల్ మిషన్ చర్చిలలో వేలాది సంఘ విశ్వాసులు, సంఘ పెద్దలు, యువత సండే స్కూల్ పిల్లలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని కేథలిక్ సెయింట్ జాన్స్ ప్యారిస్ చర్చిలో పరిశుద్ధ బహిరంగ శిలువ మార్గాన్ని నిర్వహించారు. ప్రత్యేక సువార్త కీర్తనలతో శిలువ మార్గాన్ని వైభవంగా సాగింది. క్రీస్తు శిలువ శ్రమలు, శిలువ వేసే ముందు క్రీస్తు శిలువను మోసే సన్నివేశాలతో విశ్వాసులు ర్యాలీలో ప్రదర్శించారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ ప్రావెన్సియల్ సుపీయర్ రెవరెండ్ ఫాదర్ భక్తుల జయరాజు, విచారణ గురువుల ఫాదర్ రెవరెండ్ జీవన్‌కుమార్, రెవరెండ్ ఫాదర్ సుందర్, ఫాదర్ మధు పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఏసు క్రీస్తు శిలువతో ప్రదర్శన చేస్తున్న భక్తులు



నిడదవోలు మండలం డి.ముప్పవరంలో శిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు



కొవ్వూరు టౌన్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా స్వాతంత్ర్యోద్యమ ప్రారంభ దినోత్సవం

చాగల్లు: భారత స్వాతంత్ర్యోద్యమ ప్రారంభ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో మల్లవరం గాంధీ స్మారక కేంద్రం ఆనంద నికేతన్ గాంధీ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి గాంధీ విగ్రహానికి సర్వోదయ మండలి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాపూజీ నేతృత్వంలో స్వరాజ్య సంగ్రామానికి మల్లవరం గాంధీ ఆశ్రమం ఉద్యమస్ఫూర్తి రగిలించిన ఎంతో విలువైన ప్రదేశమని జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. పారిశ్రామికవేత్త, దాత లకంసాని సత్యనారాయణ (పెద్ద అబ్బులు) ఆధ్వర్యంలో ఆశ్రమం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, చర్ల సుశీల వృద్ధాశ్రమ నిర్వాహకురాలు మృధుల, లకంసాని రామకృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

పల్లెల్లో కేంద్ర బలగాల కవాతు

నిడదవోలు రూరల్: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర, పోలీసు బలగాలతో కలిసి మండలంలోని మునిపల్లి, కోరుపల్లి, జీడిగుంట, పందలపర్రు గ్రామాల్లో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సమిశ్రగూడెం ఎస్సై రమేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు వచ్చాయన్నారు. ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఏఎస్సై పరమహంస, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.